# ఈ కథ చదవకండి

ఇంద్ర ధనస్సులో రంగుల ఆకర్షణ వంటిదే సినిమా తారలపై వల్లమాలిన, శృతిమించిన అభిమానం. ఆ అభిమానంతో విలువైనవి ఎన్ని పోగొట్టుకుంటున్నారో తెలుసుకోలేని యువత ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతూంది.

ఏ మాత్రం సహజతలేని తన అసమాన నటకౌశలంతో, శృంగార తారలతో పిచ్చి నాట్యాలుచేసి యువతను ఉయ్యాలలూగిస్తున్న ఒక యువ నట కిశోరం సినిమా ఆ రోజు విడుదల అవుతూంది. ఆ వూళ్ళో అలజడి మొదలైంది. సదరు హీరోగారికి వివిధ సైజుల కటవుట్లతో ఊరేగింపు జరుగుతూంది.

ఒక పెద్ద ట్రాక్టర్ ట్రైలర్‌లో ఇరవై అడుగుల కటవుట్‌కి గులాబీ పూలదండవేశారు. ఆ దండకు వెయ్యిరూపాయలుఖర్చుఅయిందట! ఆ ట్రాక్టర్‌కి ముందు నడుస్తున్న పది రిక్షాలలో, హీరో వేసిన వివిధ వేషాలు వేసుకుని నిలబడి నృత్యం చేస్తున్నారు యువకులు.

మొదటి రిక్షాలో జమిందార్ వేషం వేసుకున్న యువకుడు పదో తరగతి పదోసారి వ్రాయబోతున్నాడు. వాడి తండ్రి రిక్షాతొక్కి వాడిని చదివిస్తున్నాడు.

రెండో రిక్షాలో రౌడీ రంగడి వేషం వేసుకున్నవాడు ఒక మధ్య తరగతి కుటుంబీకుని కొడుకు "బాగా చదువుకుని నీ కాళ్ళమీద నిలబడరా" అంటే ఈ దుర్వ్యసనానికి పాల్పడి కాలేజీకి వెళ్ళకుండా ఈ నిర్వాకం చేస్తున్నాడు.

మూడో రిక్షాలో ముష్టివాడి వేషం వేసుకున్నవాడు వడ్డీవ్యాపారి దగాచంద్ కొడుకు. తాత ముత్తాతలు, తండ్రి అక్రమంగా సంపాదించింది యథాశక్తి ఇలాంటి పుణ్యకార్యాలకి వినియోగిస్తుంటాడు. పిల్లికి బిచ్చం పెట్టడు. ఊరేగింపులో సగం ఖర్చు ఇతనిదే. మిగతా రిక్షాలలో వున్న యువకుల చరిత్రలు ఇలాగే వున్నాయి. ఊరేగింపు నడిబజార్లోకి వచ్చింది. ట్రాక్టర్లోవున్న యువకులు కూడా నృత్యం చేస్తూ, ఉపగ్రహంలో చంద్ర మండలానికి వెళ్ళినంత సంతోషంగా వున్నారు.

వొరేయ్ ఇలాంటి ఊరేగింపు ఇంత వరకూ ఎవరూ చేయలేక పోయారు. ఇకపోతే మన తరువాతి కార్యక్రమం వంద సినిమా టిక్కెట్లు పంచిపెట్టడం. ముఖ్యంగా ఈ టిక్కెట్లు కొనలేని వారికి ఇవ్వడమే అను కుంటున్నారు వాళ్ళు. అవును నిజంగా చాలా పుణ్యకార్యమే!

ఊరేగింపు వెళ్తుంటే బడుగు వర్గాలు, మధ్యతరగతి వాళ్ళు, బిచ్చ గాళ్ళు అందరూ "అయ్యో ఎంత డబ్బు ఇలా వృధా అయిపోతూంది అని వాపోతున్నట్లుగా, భారతమాత తన సంపదని ఎవరో కొల్లగొట్టుకుని పోతు న్నప్పుడు దీనంగా చూస్తున్నట్లు, చూస్తున్నారు. ఊరేగింపు ఆగింది. ఆ హీరోగారు చేసిన పిచ్చి డ్యాన్సులు యువకులు స్కాచ్ తాగినట్లూ తూలు తూ చేస్తున్నారు. ఈలోగా ట్రాక్టర్ దగ్గరికి ఒక బిచ్చగాడు వచ్చాడు. అతని శరీరం అస్థిపంజరానికి ప్లాస్టిక్ గుడ్డ అతికించినట్లుగావుంది. భారత దేశ పటంలో వర్షాలు పడని ప్రదేశాలు ఉబ్బెత్తుగా గుర్తించినట్లుగా అతని ఎముకలు కనిపిస్తున్నాయి. వర్షాలు లేక బీట్లుపడిన పొలంలా ఎగుడు దిగు డుగా వున్న అతని కడుపు లోతుకుపోయింది.

"అయ్యా రెండు రోజుల నుంచి కూడులేదు. ధర్మం చెయ్యండి" ఒక యువకిశోరం ఈ మాట విని "అరేయ్ వీడికి ఒక టికెట్ ఇద్దాం. మన హీరో అసలు బడుగు వర్గాల కోసమే చిత్రాలలో నటిస్తున్నాడు (అతను లక్షల రూపాయల పారితోషికం తీసుకొని వేసిన బిచ్చగాడి వేషం దీనికి నిదర్శనం అని వాళ్ళ వాదన) అందుకని వీడికి టికెట్ ఇస్తే మన హీరో సంతోషిస్తాడు" అని అతనికి టికెట్ ఇచ్చారు.

ఇదేంటి బాబయ్యా ఈ చీటీ ఇస్తే హోటల్‌లో అన్నం పెడతారా?" అన్నాడు వాడు.

"కాదుబే! సినిమా చూపిస్తారు చూడు

వద్దులే బాబయ్యా...."

తీసుకోవోయ్ ఇవ్వాళ వందరూపాయలు పెట్టినా నీకు టికెట్ దొర కదు తెలుసా?

"నాకు అన్నం కావాలి బాబయ్యా.... పోనీ ఒక రూపాయి ఇప్పించండి.

వెళ్ళవోయ్—మా హీరో సినిమా టికెట్ వద్దన్న వాడికి అన్నం మాత్రం ఎందుకూ?"

ఊరేగింపు కొనసాగుతుంది.

ముష్టివాడు చిత్రంగా చూస్తున్నాడు.

....o....

# శాంతి

వివాహం అనేది భగవంతుడు ఏర్పాటు చేసిన ఒక దివ్యమైన స్త్రీ పురుషుల కలయిక.

అది నేటిసమాజంలో వ్యాపారమయింది. కారణం "ధన మూలం ఇదం జగత్" డబ్బుకోసం గడ్డితినే రోజులు.

శాంతి నల్లగా ఉంటుంది.

అలాగని అందవికారంగా ఉండదు.

....ఐదున్నర అడుగుల ఎత్తులో, వడ్డాది పాపయ్యగారి చిత్రాలలో స్త్రీమూర్తులలాగా వయసు పొంగులతో మగాళ్ళను పిచ్చెక్కించే రూపం ఆమెది. ఆమె ధనవంతుల ఇంట్లో పుట్టింది కాబట్టి, ఈ మధ్యనే భర్తను కొన్ని లక్షలుపోసి కొనుక్కుంది. లక్షలకు తగ్గట్టుగా లెక్కలేనన్ని కానుకలూ వగైరాలు శాంతి వెంబడే నడుచుకుంటూ భర్త కుమార్ ఇంటికి వచ్చేశాయి. కుమార్‌కి తండ్రిలేడు. తల్లిచాటు బిడ్డడు.

ఆడాళ్లు తెల్లగావుంటే అందంగా ఉంటారని మగాళ్ళకు పిచ్చి నమ్మకం. కాని నల్లగావున్న స్త్రీలోవున్న కళ తెల్లగా వున్నవాళ్ళలో ఉండదని కొంతమంది మగాళ్ళకు తెలియదు. ఈ సత్యం కుమార్ తెలుసుకున్నాడు.

ఒక నెలరోజులు శాంతితో సహజీవనం సాగించేడు.

ఒకరోజు రాత్రి, శాంతి తన భర్త కుమార్‌తో మర్నాడు నాగార్జున